నేడు ఎక్సైజ్ స్టేషన్‌లో వాహనాల వేలం

చందానగర్: శేరిలింగంపల్లి మండలం ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ స్టేషన్‌లో వివిధ కేసులలో పట్టుబడ్డ వాహనాలకు సోమవారం వేలం నిర్వహిస్తున్నామని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో మండల పరిధిలో గంజాయి, సారా సరఫరా చేస్తూ పట్టుబడ్డ 10 వాహనాలు ఎక్సైజ్ సూపరింటెండెంట్ కృష్ణ ప్రియ ఆదేశాల మేరకు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉదయం 11 గంటల నుంచి వేలం నిర్వహిస్తున్నామన్నారు.

20, 21 తేదీలలో కల్చరల్, స్పోర్ట్స్ ఫెస్ట్

రాయదుర్గం: గచ్చిబౌలిలోని 'నిథమ్' ప్రాంగణంలో నిథ్మాదిత్యం' పేరిట ప్రత్యేక ఇంటర్‌కాలేజ్ కల్చరల్, స్పోర్ట్స్ ఫెస్ట్–2025 నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈనెల 20,21 తేదీలలో ఈ ఫెస్ట్‌ను నిర్వహిస్తారు. నగరంలో పలు కళాశాలలకు చెందిన విద్యార్థులకు ఈ పోటీలలో పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తారు. ఆయా విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులు తమలోని క్రీడా, సాంస్కృతిక నైపుణ్యాలను ప్రదర్శించేందుకు ఈ పోటీలు ఎంతో ఉపయుక్తంగా మారనున్నాయి. పూర్తి వివరాలకు 95738 32289, 9553700031 నెంబర్లకు ఫోన్ చేయవచ్చు.

ఘనంగా లక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవం



ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్‌లోని డైమండ్ హైట్స్‌లో వెలిసిన లక్ష్మీగణపతి దేవాలయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ, గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి స్వామి ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

మాదాపూర్: మాదాపూర్‌లో గుర్తుతెలియని వ్యక్తి ఆదివారం మృతి చెందాడు. మాదాపూర్ పోలీసులు తెలిపిన మేరకు.. ఉదయం 10 గంటల ప్రాంతంలో గుర్తుతెలియని మృతదేహాన్ని గమనించి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

ఆలయంలో చోరీ



జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలం గడ్డపోతారం మున్సిపాలిటీలోని హనుమాన్ ఆలయంలో చోరీ జరిగింది. శనివారం అర్ధరాత్రి ఆలయంలోకి దుండగలు ప్రవేశించి హుండీని ధ్వంసం చేశారు. హుండీలోని డబ్బులను దోచుకెళ్లారు. విషయంపై గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నేడు ప్రజావాణి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం 'ప్రజావాణి'కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఉపకమిషనర్ డాక్టర్ రవి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సర్కిల్ పరిధిలోని ప్రజలు ఫిర్యాదులు అందించవచ్చన్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది ప్రజావాణిలో పాల్గొంటారని అక్కడికక్కడే సమస్య పరిష్కారానికి కృషి చేస్తారని వెల్లడించారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

రాజేంద్రనగర్: ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్ సూచించారు. రాజేంద్రనగర్ బుద్వేల్‌లో థైరోకేర్ డయాగ్నోస్టిక్ సెంటర్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... మారుతున్న జీవనశైలితో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని అన్నారు. అందుకే ప్రతి ఒక్కరూ జీవనశైలికి అనుగుణంగా సరైన ఆహారం, నిద్ర తీసుకుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రావణ్, సాయి, దేవి, మధు తదితరులు పాల్గొన్నారు.

జర్నీ.. ఇక హ్యాపీ

ట్రిపుల్ ఐటీ జంక్షన్‌కు మహర్దశ



గచ్చిబౌలి: ఐటీ కారిడార్‌లో అత్యంత రద్దీగా ఉండే జంక్షన్లలో ట్రిపుల్ ఐటీ జంక్షన్ ఒకటి. నిత్యం గంటకు వేలాది వాహనాలు రాకపోకలు చేస్తుంటాయి. పటాన్‌చెరు, లింగంపల్లి నుంచి మాదాపూర్, రాయదుర్గం, మెహిదీపట్నం, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌కు, మెహిదీపట్నం, జూబ్లీహిల్స్, కొండాపూర్ వైపు నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌కు వేల సంఖ్యలో ఐటీ, ఐటీయేతర ఉద్యోగులు, సాధారణ ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. గోపన్‌పల్లి, నల్లగండ్ల , కోకాపేట్, నార్సింగి వైపు నుంచి డీఎల్‌ఎఫ్‌కు నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. ప్రధాన రహదారిపై ఉన్న ట్రిపుల్ జంక్షన్ విస్తరణకు నోచుకోకపోవడంతో ట్రాఫిక్ తిప్పలు అంతా ఇంతా కాదు. ఉదయం, సాయంత్రం వేళలో కిలోమీటర్ల పొడవునా వాహనాల రాకపోకలు స్తంభించిపోతున్నాయి. జంక్షన్ జాంతో వాహనదారులు ట్రాఫిక్ నానా ఇక్కట్లకు గురవుతున్నారు. అందుకే ఇక్కడ ట్రిపుల్ ఐటీ జంక్షన్‌లో ఫ్లై ఓవర్, అండర్ పాస్ నిర్మించనున్నారు.

- త్వరలో ఫ్లైఓవర్, అండర్ పాస్‌కు టెండర్ ప్రక్రియ
- ట్రాఫిక్‌కు చెక్ పెట్టేందుకు వడివడి అడుగులు
- ఇప్పటికే స్థల సేకరణ పూర్తి
- గచ్చిబౌలి టు లింగంపల్లి తీరనున్న ట్రాఫిక్ కష్టాలు
- ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ నుంచి డీఎల్‌ఎఫ్‌కు సాఫీ ప్రయాణం

ఫ్లై ఓవర్, అండర్ పాస్

ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకొని ట్రిపుల్ ఐటీ జంక్షన్‌లో ఫ్లై ఓవర్, అండర్ పాస్ నిర్మాణానికి ప్రభుత్వం అంగీకారం తెలిపింది. హెచ్‌సిటీ వర్క్స్‌లో భాగంగా ఫ్లై ఓవర్, అండర్ పాస్ ప్రతిపాదనలకు అమోదం లభించింది. ఇప్పటికే డీపీఆర్ రూపొందించారు. త్వరలో టెండర్ ప్రక్రియ నిర్వహించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. టెండర్ ప్రక్రియ పూర్తయితే త్వరలోనే పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

ట్రాఫిక్‌కు చెక్

- ట్రిపుల్ ఐటీ జంక్షన్‌లో ఫ్లై ఓవర్, అండర్ పాస్ అందుబాటులోకి వస్తే వాహనదారులకు పెద్ద ఉపశమనం అనే చెప్పాలి.
- గచ్చిబౌలి వైపు నుంచి లింగంపల్లి వైపు అండర్ పాస్ నిర్మాణం, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ నుంచి డీఎల్‌ఎఫ్‌కు ఫ్లై ఓవర్ నిర్మాణం చేపట్టనున్నారు.
- రెండు వైపుల రాకపోకలకు అవకాశం ఉండే విధంగా నిర్మాణం జరిగితే వాహనాలు సాఫీగే వెళ్లే అవకాశం ఉంది.
- జూబ్లీహిల్స్, మాదాపూర్, మియాపూర్, కూకట్‌పల్లి, మెహిదీపట్నం వైపు వాహనదారులు అంతరాయం లేకుండా అటు డీఎల్‌ఎఫ్, ఇటు ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌కు వెళ్ల వచ్చు.
- ఐటీ ఉద్యోగులు డీఎల్‌ఎఫ్ నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, నల్లగండ్ల, మెహిదీపట్నం, మాదాపూర్, కొండాపూర్ వైపు ట్రాఫిక్ జాం లేకుండా రాకపోకలు చేయవచ్చు.
- పటాన్‌చెరు, ఆర్సీపురం, అమీన్‌పూర్, చందానగర్, లింగంపల్లి నుంచి వాహనదారులు ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, నాలెడ్జ్‌సిటీ, మాదాపూర్, రాయదుర్గం, మెహిదీపట్నం, కొండాపూర్ వైపు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా వెళ్లవచ్చు.
- గచ్చిబౌలి, అంజయ్యనగర్, ఇందిరాగనర్, వినాయక్‌నగర్, జీపీఆర్‌ఏ క్వార్టర్స్,జేవీ కాలనీ, ఏపీహెచ్‌బీ కాలనీలకు చెందిన స్థానికి వాహనదారులకు జంక్షన్‌లో ట్రాఫిక్ కష్టాలు తప్పినట్లే అవుతుంది.



ట్రిపుల్ ఐటీ జంక్షన్‌లో స్థల సేకరణ చేపట్టిన దృశ్యం

గచ్చిబౌలిలోని ట్రిపుల్ ఐటీ జంక్షన్ ఇదే

స్థల సేకరణ పూర్తి

ట్రిపుల్ ఐటీ జంక్షన్‌లో స్థల సేకరణ సవాల్‌గా మారింది. గతంలో అధికారులు ప్రయత్నాలు చేసినా ఫలించలేదు. ప్రధాన రహదారి కావడం, చదరపు గజం ధర రెండు లక్షల పైనే ఉండటంతో స్థల సేకరణకు అనేక అడ్డంకులు వచ్చేవి. ప్రస్తుతం వెస్ట్ జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని స్థల సేకరణ చేపట్టారు. ట్రిపుల్ ఐటీ జంక్షన్ విస్తరణలో భాగంగా డీఎల్‌ఎఫ్ నుంచి గచ్చిబౌలి వైపు, ఐఎస్‌బీ వైపు నుంచి లింగంపల్లి వైపు, గచ్చిబౌలి వైపు ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ రోడ్డు వైపు స్థల సేకరణ పూర్తి చేశారు. ఫ్లైఓవర్, అండర్ పాస్ నిర్మాణపు పనులు మొదలైతే కొంత మేరకు వాహనాల రాకపోకలు సాగే విధంగా చర్యలు తీసుకున్నారు.

ట్రాఫిక్‌కు తగ్గట్లుగా వసతులు తప్పని సరి

ఐటీ కారిడార్‌లో ఫ్లై ఓవర్లు, ఆర్‌వోబీలు, అండర్ పాస్‌ల నిర్మాణాలు జరిగినా ట్రాఫిక్ కష్టాలు పూర్తి స్థాయిలో పరిష్కారానికి నోచుకోవడం లేదు. 10 ఫ్లై ఓవర్లు , 4 అండర్ పాస్‌లు, మూడు ఆర్‌వోబీలు, 14 లింక్‌రోడ్ల నిర్మాణం జరిగినా పెరుగుతున్న వాహనాల రద్దీతో ట్రాఫిక్ జాం నెలకొంటుంది. ప్రధాన రహదారుల విస్తరణ, అన్ని కూడళ్ల విస్తరణ, ప్రత్యామ్నాయ చర్యలు చేపడితేనే పరిష్కారం లభించే అవకాశం ఉంది.



ట్రిపుల్ జంక్షన్‌లో బారులుదీరిన వాహనాలు

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ



సామూహిక ప్రార్థనల్లో ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని నవజ్యోతి యూత్ క్లబ్ ఆవరణలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మజ్లీస్ పార్టీ నాయకుడు ముర్తుజా అలీ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్సీ రహమత్ బేగ్, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా పోచమ్మ ఆలయ 7వ వార్షికోత్సవం

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పద్మశాలి పురంలోని పొచమ్మ తల్లి ఆలయ 7వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని వివిధ రకాల పూలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మత్తు మందు విక్రయిస్తున్న యువకుడి అరెస్టు

శంషాబాద్ రూరల్: పట్టణంలోని ఆర్బీనగర్ కాలనీలో మత్తు మందు విక్రయిస్తున్న యువకుడిని శనివారం రాత్రి ఎస్‌ఓటీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మహారాష్ట్రకు చెందిన అభిషేక్ సంజయ్ తోటర్(24) డ్రగ్స్ తీసుకోవడంతో పాటు విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఓటీ పోలీసులు నిఘా వేశారు. గణేష్ థియేటర్ వద్ద అతడిని పట్టుకుని తనిఖీ చేశారు. 13 గ్రాముల ఎండీఎం మత్తు మందు లభించింది. దీని విలువ రూ.1.80 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయం



కార్యక్రమంలో మాట్లాడుతున్న శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

అల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని నిజాంపేట్ రోడ్డులోని హోలిస్టిక్ హాస్పిటల్‌లో తెలంగాణ, ఒడిశా డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా మెడికల్ క్యాంప్‌ను ఆదివారం నిర్వహించారు. ఈ క్యాంప్‌ను హాస్పిటల్ చైర్మన్ రాంచందర్, డాక్టర్ రవిశంకర్‌తో కలిసి పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెడికల్ క్యాంప్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతి మొదటి, మూడవ ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉచిత మెగా హెల్త్ క్యాంప్ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ ఒడిశా డాక్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ నిహార్ ప్రధాన, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ అనురాధ పాండా, సెక్రటరీ డాక్టర్ కలిల్, డాక్టర్ సునీల్ స్పైన్, నాయకులు దామోదర్ రెడ్డి, ఎండీ ఇబ్రహీం , అష్రాఫ్, వైద్య సిబ్బంది సునీత, కాలనీ వాసులు, మహిళలు పాల్గొన్నారు.

స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలకు నిరసన



మియాపూర్: స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అసెంబ్లీలో బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేటీఆర్, జగదీశ్వర్‌రెడ్డిల దిష్టిబొమ్మలను దహనం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, శేరిలింగంపల్లి నియోకవర్గం మహిళా అధ్యక్షురాలు చంద్రిక ప్రసాద్, శేరిలింగంపల్లి యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ జాకీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు





మాదాపూర్ శిల్పారామంలో వారాంతపు కార్యక్రమాలలో భాగంగా ఆదివారం భరతనాట్యం, కూచిపూడి, సంగీత కచేరీలు సందర్శకులను అలరించారు. చెన్నైకి చెందిన కళాకారిణి వర్షరాజ్‌కుమార్ భరత నాట్య ప్రదర్శన ఇవ్వగా స్నేహ రాంచందర్ శిష్యబృందం సంగీత కచేరీ ఇచ్చింది. – మాదాపూర్

ఎమ్మార్పీఎస్ దీక్షకు బీఆర్‌ఎస్ సంఘీభావం



ఎమ్మార్పీఎస్ దీక్షకు సంఘీభావం తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

శంషాబాద్ రూరల్: మాదిగల రిజర్వేషన్ల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న మొండి వైఖరిని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ నాయకులు ఆదివారం శంషాబాద్ బస్టాండ్ వద్ద రిలే నిరాహార దీక్షను చేపట్టారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మోహన్‌రావు దీక్షాస్థలికి చేరుకుని సంఘీభావం తెలిపారు. అనంతరం అయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగల రిజర్వేషన్ల పట్ల దోబూచూలాడుతోందని విమర్శించారు. దామాషా ప్రకారం రిజర్వేషన్ కల్పించకుండా కొన్ని వర్గాలకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సతీష్, జయమ్మ, కె.శ్రీనివాస్, రాజేందర్, అశోక్, చెన్నకేశవులు, తదితరులు పాల్గొన్నారు.

వరల్డ్ కిడ్నీ డే సందర్భంగా బైక్ ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ

మాదాపూర్: మాదాపూర్‌లోని మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో వరల్డ్ కిడ్నీడే సందర్భంగా బైక్ ర్యాలీని ఆదివారం నిర్వహించారు. మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ సత్యానారాయణ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ కమల్‌కిరణ్ మాట్లాడుతూ.. దేశంలో దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధులు వేగంగా పెరుగుతున్నాయన్నారు. మూత్రపిండాలకు ముందస్తు పరీక్షలు చేయించుకొండి అనే థీమ్‌తో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్టు తెలిపారు. నెఫ్రాలజిస్ట్ డాక్టర్ అరుణ్‌కుమార్, చీఫ్ ఆఫ్ బిజినెస్ ఆపరేషన్స్ మహేష్‌దెగుల్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను బీఆర్‌ఎస్ మోసం చేసింది



మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి దిష్టి బొమ్మ దగ్ధం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

చందానగర్: తెలంగాణ రాష్ట్రానికి దళిత ముఖ్యమంత్రి చేస్తానని బీఆర్‌ఎస్ పార్టీ మోసం చేసిందని శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జగదీశ్వర్ గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం చందానగర్‌లోని డాక్టర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మాజీమంత్రి జగదీష్ రెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. రాష్ట్ర ఎంబీసీ చైర్మన్ జెరిపేటి జైపాల్, నియోజకవర్గం ఇంచార్జి జగదీశ్వర్ గౌడ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. అసెంబ్లీలో స్పీకర్‌పై బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డిపై సస్పెండ్ చేయడం సరైన నిర్ణయమన్నారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్ళర్పించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కోర్డినేటర్ రఘునందన్‌రెడ్డి, మిరియాల ప్రీతం, కటికె రాజు పాల్గొన్నారు.

చిన్నారుల్లో డయాబెటిస్‌పై అవగాహన అవసరం



మాట్లాడుతున్న డాక్టర్ వసంత్ కుమార్

బంజారాహిల్స్: దేశంలో డయాబెటిస్ బాధపడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని ఆందోళనకరమని ప్రముఖ వైద్యులు వసంత్‌కుమార్ అన్నారు. ఆదివారం జూబ్లీహిల్స్‌లోని దసపల్లా హోటల్‌లో డే సొసైటీ ఆధ్వర్యంలో చిన్నపిల్లల్లో వచ్చే డయాబెటిస్‌పై ఆయన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వసంత్‌కుమార్ మాట్లాడుతూ తాము గత 25 ఏళ్లుగా డయాబెటిస్‌తో బాధపడుతున్న నిరుపేద చిన్నారులకు మందులు ఇవ్వడంతో పాటు ఇన్సులిన్ ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. డయాబెటిస్‌పై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని 30 ఏళ్ల దాటిన వారంతా షుగర్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆహార అలవాట్లు, బరువు పెరగడంతో పాటు పలు కారణాల వల్ల ఎంతో మంది డయాబెటిస్ బారిన పడుతున్నారన్నారు. షుగర్, బీపీ కారణంగా శరీరంలోకి చాలా వ్యాధులు ప్రవేశిస్తున్నాయని ప్రాథమిక దశలోనే వాటిని గుర్తించి దానికి తగిన వైద్యం తీసుకుంటే మంచి ఫలితాలతో పాటు ఆరోగ్యంగా ఉండొచ్చని తెలిపారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీ చైర్మన్ పద్మనాభయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నంబర్‌కు 'ఫోన్ నంబర్' లింక్ చేయండి

మణికొండ: మున్సిపాలిటీలో ఆస్తులు ఉన్న వారు తమ ఇంటి నంబర్, పీటిన్ నంబర్లకు మీ ఫోన్ నంబర్‌ను లింక్ చేసుకోవాలని నార్సింగి మున్సిపల్ కమిషనర్ టి. కృష్ణమోహన్‌రెడ్డి కోరారు. అపుడు వారి ఆస్తుల వివరాలు, పన్నులు, చెల్లింపులు, బకాయిల వివరాలు ఎప్పటికప్పుడు మెసేజ్‌ల రూపంలో సమాచారం వస్తుందన్నారు. సీడీఎంఏ లింక్ ద్వారా లేదా మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించి లింక్ చేసుకోవాలని కోరారు.

కార్మికుల కోసం నిరంతర పోరాటం



మాట్లాడుతున్న చుక్కా రాములు

పటాన్‌చెరు: గత 40 ఏళ్లుగా కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా శాండ్విక్ ఎంప్లాయిస్ యూనియన్ నిరంతర పోరాటం చేస్తుందని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు, శాండ్విక్ యూనియన్ అధ్యక్షుడు చుక్కా రాములు పేర్కొన్నారు. పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతంలోని శాండ్విక్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ అనుబంధంగా 40 ఏళ్ల (1985–2025) పూర్తి చేసుకుంటున్న సందర్భంగా మండలంలోని పోచారం గ్రామ పరిధిలో గల క్రీడా మైదానంలో కార్మికులకు క్రికెట్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల ప్రారంభోత్సవానికి హాజరైన చుక్కా రాములు మాట్లాడుతూ...ఒక పరిశ్రమలో 40 ఏళ్లపాటు ఒకే నాయకత్వంలో కార్మికులను ఐక్యంగా నిలబెట్టి అనేక అద్భుత విజయాలు సాధించడం హర్షణీయమన్నారు. ముగింపు ఉత్సవాలు మండలంలోని కర్ధనూర్‌లోని జేపీ ఫంక్షన్ హాల్‌లో ఉంటాయని, కార్మికులందరూ పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శాండ్విక్ యూనియన్ నాయకులు పాండు రంగారెడ్డి, మనోహర్, వీరారావు, సదాశివరెడ్డి, మల్లేశం, నర్సింలు తదితర కార్మికులు పాల్గొన్నారు.

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు

జేఏసీ ఆధ్వర్యంలో హెచ్‌సీయూలో నిరసన

రాయదుర్గం: హెచ్‌సీయూలో నూతనంగా భూపోరాటం కోసం ఏర్పడిన జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి భారీ నిరసన తెలిపారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్‌లోని నార్త్ గేట్ వద్ద విద్యార్థులు, టీచింగ్, నాన్‌టీచింగ్, వర్కర్స్ అసోసియేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం ప్రభుత్వం జారీ చేసిన ప్రెస్ రిలీజ్ కాపీలను దహనం చేశారు.



అమరజీవికి ఘన నివాళి

మణికొండ: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని ఆదివారం మణికొండలో ఘనంగా నిర్వహించారు. మణికొండ వాసవీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు యాదగిరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ.. తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును తొలగించడం సబబు కాదన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు.

అసభ్య పోస్టులపై చర్యలు తప్పవు



పటాన్‌చెరు టౌన్: సీఎం రేవంత్‌రెడ్డిపై సోషల్‌మీడియాలో అసభ్య పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తప్పవని కాంగ్రెస్ శ్రేణులు హెచ్చరించారు. ఆదివారం పట్టణ అధ్యక్షుడు నరసింహారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు సీఐ వినాయక్‌రెడ్డికి ఫిర్యాదు పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా బీఆర్‌ఎస్‌కు అనుకూలంగా పోస్టులు పెట్టడం చూస్తే.. దీని వెనుక బీఆర్‌ఎస్ పార్టీ ఉందని అనుమానం వ్యక్తం అవుతుందన్నారు. సీఎంతో పాటు వారి కుటుంబ సభ్యులపైన తీవ్ర పదజాలంతో దూషిస్తూ రోజువారీగా సామాజిక మాధ్యమాల ద్వారా పోస్టులు పెడుతూ తీవ్ర ఆందోళనకు గురిచేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.